క్లుప్తంగా

ఘనంగా విఘ్నేశ్వర స్వామి కల్యాణం



నందిగామ: పట్టణంలోని పాత బస్టాండ్‌లో గల పురాతన విఘ్నేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షిక కల్యాణ మహోత్సవాలలో భాగంగా వేకువజామునే స్వామివారికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి వారి కల్యాణం శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ఆ తర్వాత అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే సిబ్బంది సంక్షేమానికి విజయవాడ డివిజన్ అధిక ప్రాధాన్యమిస్తోందని డీఆర్‌ఎం శివేంద్రమోహన్ పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని ఈటీటీసీ (ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రెనింగ్ సెంటర్)లో ఆధునీకరించిన కిచెన్, డైనింగ్ హాల్, వాకింగ్ ట్రాక్‌లను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణపురంలోని ఈటీటీసీ సెంటర్‌లో దక్షిణ మధ్య రైల్వేతోపాటు ఇతర జోన్లలోని రన్నింగ్, టీఆర్‌ఎస్, ఈఎంయూ, టీఆర్‌డీ సిబ్బందికి వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తారన్నారు. 2007 నుంచి ఇక్కడ 3-ఫేజ్ లోకోమోటివ్‌లపై కూడా లోకో పైలెట్లకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ నుంచి ఏడాదికి 7 వేల మంది లోకోపైలట్‌లు శిక్షణ పొందుతారని తెలిపారు. శిక్షణ కాలంలో వారి కోసం హాస్టల్, క్యాంటిన్ సదుపాయాలు అందిస్తున్నట్లు తెలిపారు. వారికి మరిన్ని సౌకర్యాలు అందించడానికి రూ. 30 లక్షలతో క్యాంటిన్, డైనింగ్ హాల్‌తో పాటు 2,600 మీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, సీనియర్ డీఈఈ కొండా శ్రీనివాసరావు, ఆర్‌సీ సాహు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కిజోఫ్రెనియాపై అవగాహన కల్పించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్కిజోఫ్రెనియా వ్యాధిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని డాక్టర్ ఆయోధ్య ఆర్.కె. అన్నారు. ప్రపంచ స్కిజోఫ్రెనియా ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా బుధవారం ప్రెస్ క్లబ్‌లో మానస సైకియాట్రిక్ నర్సింగ్ హోం అధినేత డాక్టర్ అయోధ్య ఆర్.కె. ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ బుధవారం నుంచి మానసిక ఆరోగ్యంపై ప్రధానంగా స్కిజోఫ్రెనియాపై ప్రజల్లో అవగాహన పెంచడానికి వారంపాటు వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) నిర్ణయించిందన్నారు. 24న ప్రపంచ స్కిజోఫ్రెనియా ఆరోగ్య దినంగా గుర్తించారని పేర్కొన్నారు. మానసిక వైద్యులు, సైకాలజిస్టు, సైకియాట్రిస్టులు, ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు విస్తృత ప్రచారం చేసి, వారాంతంలో కార్యక్రమాలను సమీక్షించుకుంటామని తెలిపారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌లో భాగంగా వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ మెంటల్ హెల్త్ (డబ్ల్యూఎఫ్‌ఎంహెచ్) ఆధ్వర్యంలో వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ప్రపంచంలో 0.3 నుంచి 0.7 శాతం ప్రజలు జీవిత కాలంలో స్కిజోఫ్రెనియా వ్యాధి పీడితులేనని పేర్కొన్నారు. వ్యాధి వంశపారంపర్యంగా, జీవితంలో ఎదురైన ఒడిదొడుకులు, మెదడులోని కెమికల్ ఇన్‌బ్యాలెన్స్, ఇతరత్రా కారణాలతో వస్తుందన్నారు. దీని ప్రభావం పురుషుల్లో, స్త్రీలల్లో సమానంగా ఉంటుందని తెలిపారు. స్కిజోఫ్రెనియా వ్యాధితో బాధపడేవారికి యాంటి సైకోటిక్స్ అనే మందులు వాడడం ఉత్తమమని చెప్పారు. తొలుత వ్యాధి పట్ల రోగికి, వారి కుటుంబ సభ్యులకు అవగాహన (సైకో ఎడ్యుకేషన్) కల్పించాల్సి వుంటుందన్నారు. డాక్టర్ మానస, డాక్టర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన ఇల్లయితే ఇలా ఉంచుకుంటామా?

- నాడు-నేడు పనులంటే ఇంత అశ్రద్ధ చూపుతారా?
- గౌరవరం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంపై ఏపీసీ ఆగ్రహం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానంటూ హెచ్చరిక




గౌరవరంలో నాడు-నేడు పనులపై హెచ్‌ఎంతో మాట్లాడుతున్న ఏపీసీ మహేశ్వరరావు

గౌరవరం(జగ్గయ్యపేట): "మన ఇల్లు అయితే ఇలా ఉంచుకుంటామా..ప్రతి నెలా ప్రభుత్వం మనకి వేలల్లో జీతం ఇస్తోంది. మనది కాదులే అని అంత అశ్రద్ధగా ఉంటామా.. పాఠశాలల్లో నాడు-నేడు పథకం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం తీసుకుంది.. భావితరాలవారికి ఆదర్శంగా ఉండాల్సిన మీరే ఇలా ఉంటే ఎలా" అంటూ ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు గౌరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నాడు-నేడు ఫేజ్-2 కింద జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో 10 అదనపు తరగతి గదుల నిర్మాణాలకు రూ.1.20 కోట్లు, మౌలిక వసతులకు మరో రూ.63 లక్షలు మంజూరు చేసిందన్నారు. అయితే అదనపు తరగతి గదులు 30 శాతం పనులు మాత్రమే జరగటంపై ఏపీసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మౌలిక వసతులైన మరుగుదొడ్ల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న తరగతి గదుల్లో విద్యుత్ మరమ్మతు పనులు చేయాల్సిఉండగా నేటికీ పనులు ప్రారంభించలేదన్నారు. జిల్లాలో అన్ని పాఠశాలల్లో నాడు-నేడు పనులు చురుగ్గా జరుగుతుంటే ఈ పాఠశాలలో ఒక్క పని కూడా జరగలేదన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయితే విద్యార్థులు మరుగుదొడ్లు లేకపోతే ఎన్నో ఇబ్బందులు పడతారని, కనీసం ఈ పనులు చేయాలన్న శ్రద్ధ కూడా లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సిమెంట్ కొరతతో పనులు జరగడం లేదని చెప్పడంతో ఈ విషయం అధికారులకు ఎందుకు చెప్పలేదని అన్నారు. పనుల నత్తనడకపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. సచివాలయ ఇంజినీర్ ప్రణీతను కూడా ఆయన మందలించారు. అనంతరం ఆయన చిల్లకల్లు గ్రామంలో నిర్మాణంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల నిర్మాణ పనులను, హరిజనవాడలోని మండల పరిషత్ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి పంచాయతీ రాజ్ జేఈ శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వరరావు,ఏఎంవో సురేష్, సీఎంవో రాంబాబు, పీఎంసీ చైర్మన్ రాంబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



గూడెం మాధవరంలో మహిళ చెబుతున్న సమస్యలను వింటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు(కంచికచర్ల): ప్రభుత్వం అందజేస్తున్న నవరత్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. వీరులపాడు మండలం గూడెంమాధవరం గ్రామంలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం ఉదయం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్న సంక్షేమ పథకాలను కులం, మతం ప్రామాణికం కాకుండా అర్హత గల వారందరికీ అందజేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేస్తున్న ఏకైక ప్రభుత్వం సీఎం జగన్ ప్రభుత్వమన్నారు. అన్నివర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షహనాజ్ బేగం, సర్పంచి బండి సునీత, ఎంపీటీసీ సభ్యులు బండి సీతామహాలక్ష్మి నాయకులు అనుమోలు వాసు, బండి మురళి, తహసీల్దార్ ఆశియానాయక్, పలుశాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతు సంతోషంగా ఉండాలన్నదే సీఎం సంకల్పం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



చందర్లపాడులో నూతనంగా నిర్మించిన గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కేడీసీసీ బ్యాంకు చైర్మన్

నందిగామ(చందర్లపాడు): రైతు సంతోషంగా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండల కేంద్రమైన చందర్లపాడులో నాబార్డు నిధులు రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదామును కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. రూ.36.50 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సహకార సంఘ కార్యాలయ భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది రైతుల మేలుకోరే ప్రభుత్వమన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. రైతు పండించిన పంటను నిలువ చేసుకోవడానికి నిర్మించిన గోదామును రైతులు వినియోగించుకోవాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రస్తుత సర్కారు రైతుల కోసం ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు కూడా అక్కడే నుంచే కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా రైతులకు ఉపయోగపడే ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు రాయల జానకి రామయ్య, గ్రామ సర్పంచ్ కస్తాల పున్నమ్మ, పార్టీ నాయకులు యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తొర్రగుంటపాలెంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

వైఎస్సార్ సీపీ నేత వెంకటకృష్ణ ప్రసాద్



వార్డు పర్యటనలో సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ నేత వెంకటకృష్ణ ప్రసాద్

జగ్గయ్యపేట అర్బన్: ఇప్పటివరకు చిల్లకల్లు గ్రామ పంచాయతీలో ఉండి, రెండేళ్ల క్రితం జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలోకి వచ్చిన 8 వ వార్డు తొర్రగుంటపాలెంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. తొర్రగుంటపాలెం 10వ లైనులో బుధవారం స్థానికుల విజ్ఞప్తి మేరకు నూతనంగా ఏర్పాటుచేస్తున్న బోరు పంపు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధిలో బాగా వెనుకబడి పోయిన తొర్రగుంటపాలెంలో ఇప్పటికే తాగునీటి కోసం కుళాయిలతో పాటు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి తక్కువ ధరకే మినరల్ వాటర్ అందజేస్తున్నట్లు తెలిపారు. అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ స్తంభాలు, నూతన విద్యుత్ లైన్లు, వీధి లైట్లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలు వీధుల్లో ఆయన పర్యటించారు. తమ ప్రాంతంలో విద్యుత్ లో వోల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. మరొక వీధిలో డ్రైనేజ్, పబ్లిక్ ట్యాప్ ఏర్పాటుచేయాలని స్థానికులు కోరగా, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు స్టీల్‌ప్లాంట్ సుబ్బారావు, కాసర్ల బాలస్వామి, చిరంజీవి, పణితి విజయకుమార్, మెట్టు ఏడుకొండలు, పాటి రామారావు, గోపి, భాస్కర్, శ్రీను, కంట్రాక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యువకుల మధ్య ఘర్షణ



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ డిపో సెంటర్‌లో బుధవారం సాయంత్రం యువకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఒక యువకుడు దగ్గరలో ఉన్న షోడా బండి వద్ద ఉన్న నిమ్మకాయలు కోసే చాకుతో ఒక వ్యక్తిని కాలిపై గాయపరిచాడు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బాలకృష్ణ అనే వ్యక్తి బైకుపై వెళుతూ యంగ్రాతి వెంకటేశ్వర్లు అనే యువకుడిని ఢీకొన్నాడు. దీంతో యంగ్రాతి వెంకటేశ్వర్లు తనను ఎందుకు ఢీ కొట్టావని అడగటంతో ఇరువురి మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో బాలకృష్ణ అనే వ్యక్తి దగ్గరలో నిమ్మకాయల షోడా బండి వద్ద ఉన్న చాకుతో యంగ్రాతి వెంకటేశ్వర్లును కాలిపై గాయపరిచాడు. గాయపడిన యువకుని తరపు వారికి ఈ విషయం తెలిసి అతని స్నేహితులు వచ్చి గాయపరిచిన యువకుడిని చితకబాదారు. పరిస్థితిని గమనించిన స్థానికులు వారిని విడదీశారు. బాధితుడు యంగ్రాతి వెంకటేశ్వర్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం

కంచికచర్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి అన్నారు. కంచికచర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ప్రాజెక్టు సమావేశం జరిగింది. పీడీ ఉమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదని, రికార్డులన్నీ సక్రమంగా ఉండేలా చూడాలని ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు.

ఇంగ్లిష్ గ్రామర్‌లో విద్యార్థులకు శిక్షణ



అనిగండ్లపాడులో శిక్షణ శిబిరంలో విద్యార్థులు



కంచికచర్ల గ్రంథాలయంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాల గురించి బోధిస్తూ వాటికి సంబంధించిన విజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులచే పుస్తకాలు చదివించి కథలు చెప్పించారు. ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్ ఇంగ్లిష్ గ్రామర్‌లో శిక్షణ ఇచ్చారు. తరువాత చిత్రకారుడు ఎ.చంద్రశేఖర్ బొమ్మలు గీయడం నేర్పించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, సత్యావతి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

కంచికచర్ల: వేసవి విరామాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత సర్వేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్, జల్లి కారల్‌మార్క్స్, ఎం.కనకారావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

పెనుగంచిప్రోలు: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి విజ్ఞానాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిందని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం గ్రంథాలయాల్లో విద్యార్థులను కథలు చదివించటం, నీతి వాక్యాలు చెప్పించటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరంతర సాహితీ యాత్రికుడు డాక్టర్ ఆదినారాయణ



విజయవాడ కల్చరల్: నిరంతర సాహితీ యాత్రికుడు డాక్టర్ ఆదినారాయణ అని సాహితీ విమర్శకుడు డాక్టర్ కాకుమాను శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ ఆదినారాయణ రచించిన సైబీరియా బాటసారి యాత్ర గ్రంథావిష్కరణ సభ బుధవారం గవర్నర్‌పేటలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ కార్యాలయంలో జరిగింది. సభకు అధ్యక్షత వహించిన శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యావేత్తగా భావిభారత పౌరులను తీర్చిదిద్దుతూ సాహిత్యరంగంలోనూ ప్రతిభను చాటుకున్నట్లు తెలిపారు. గ్రంథాన్ని ఆవిష్కరించిన సాహితీవేత్త సూర్యకుమారి మాట్లాడుతూ ఆదినాయణ ప్రకృతి ప్రేమికుడని, గతంలో అనేక యాత్రలు చేసి గ్రంథాలను రచించినట్లు తెలిపారు. సైబీరియా బాటసారి గ్రంథంలో అక్కడి రాజకీయ సామాజిక, సాంస్కృతిక విషయాలను వివరించినట్లు తెలిపారు. సభలో వైద్యులు గుత్తా శివాజీ, న్యాయవాది చిరంజీవి, సాహిత్య సంస్థల ప్రతినిధులు ఎ.కృష్ణ, ఓరా ప్రసాద్, మందరపు హైమవతి ఆదినారాయణ సాహితీ విశేషాలను వివరించారు.

లక్ష్మయ్య మృతి వైఎస్సార్ సీపీకి తీరనిలోటు



మాజీ సర్పంచి లక్ష్మయ్య భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు(కంచికచర్ల): వీరులపాడు మండలం పెద్దాపురంలో అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచి నిప్పులపల్లి లక్ష్మయ్య(80) భౌతికకాయానికి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లక్ష్మయ్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మయ్య బతికి ఉన్నంతకాలం వైఎస్సార్ సీపీ బలోపేతం కోసం కృషి చేశారని ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఎంతో కష్టపడి పనిచేసి అధికారులతో ప్రజలకు అవసరమైన పనులు చేయించేవారన్నారు. లక్ష్మయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్‌బేగం, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆవల రమేష్‌బాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు కోటేరు సత్యనారాయణరెడ్డి, ఎం.ఆదాం తదితరులు పాల్గొన్నారు.

● జలక్రీడల్లో శిక్షణ



పున్నమి ఘాట్ సమీపంలో చిన్నారులకు శాప్ ఆధ్వర్యంలో వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో బుధవారం సుమారు 50 మందికి పైగా పాల్గొన్నారు. కయాకింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



